ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ ఇండియా 500 పీవో పోస్టులకు ప్రకటన విడుదలచేసింది. పరీక్ష, బృందచర్చ, ముఖాముఖిలో చూపిన ప్రతిభతో నియామకాలుంటాయి. ఇలా ఎంపికైనవారు ముందుగా ఏడాది వ్యవధి ఉండే పీజీడీబీఎఫ్ కోర్సు మణిపాల్ అకాడెమీలో పూర్తి చేయాలి. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇదే తరహాలో ప్రైవేటు సంస్థ యాక్సిస్ బ్యాంకు ప్రకటన వెలువరించింది. ఆ వివరాలు చూద్దాం...

బ్యాంకుల్లో కొలువుదీరుతారా..

బ్యాంక్ ఆఫ్ ఇండియా పోస్టులకు ఫిబ్రవరి 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. తేదీ తర్వాత ప్రకటిస్తారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.175. మిగిలినవారికి రూ.850. మొత్తం 500 ఖాళీల్లో జనరల్ బ్యాంకింగ్ స్ట్రీమ్‌లో 350 క్రెడిట్ ఆఫీసర్, స్పెషల్ స్ట్రీమ్‌లో 150 ఐటీ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. ఎంపికైనవారు రూ.36,000 మూలవేతనం పొందవచ్చు. దీనికి డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు అదనం. అన్నీ కలిపి సుమారు రూ.60,000 నెల వేతనం పొందవచ్చు.

ఈ రెండు పరీక్షలూ తాజా గ్రాడ్యుయేట్లు, ప్రస్తుతం చివరి సంవత్సరం కోర్సుల్లో ఉన్నవారికి మంచి అవకాశం. వీటిద్వారా ఉన్నత విద్య, ఉద్యోగం రెండూ దక్కుతాయి. బ్యాంకు కార్యకలాపాలపై చక్కని పట్టుకోసం ఈ కోర్సు ఉపయోగపడుతుంది. అలాగే ఈ ప్రకటనలకు దరఖాస్తు చేసుకుని సన్నద్ధమైనవాళ్లు భవిష్యత్తులో ఇతర బ్యాంకుల నుంచి వెలువడే ఇదే తరహా పరీక్షలను సులువుగా ఎదుర్కోవచ్చు. ఈ విధానంలో అవకాశం వచ్చినవారు పీజీ డిప్లొమా తర్వాత మణిపాల్ సంస్థ నుంచే మరో ఏడాది కోర్సు ఆన్‌లైన్/దూరవిద్యలో పూర్తిచేసుకుని ఎంబీఏ (బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్) పట్టానూ పుచ్చుకోవచ్చు.

అర్హత: క్రెడిట్ ఆఫీసర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీ ఆఫీసర్ ఉద్యోగాలకు కంప్యూటర్ సైన్స్/ ఐటీ/ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో బీఈ/బీటెక్ లేదా ఇదే విభాగాల్లో పీజీ లేదా ఏదైనా డిగ్రీతోపాటు డీఓఈఏసీలో బీ లెవెల్ ఉత్తీర్ణత.

వయసు: రెండు పోస్టులకు ఫిబ్రవరి 1, 2023 నాటికి 20 నుంచి 29 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు మినహాయింపు.

వెబ్‌సైట్: https://bankofindia.co.in/recruitment-notice

పరీక్ష ఇలా...

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	35	40	40
రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్	45	60	60
జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్	40	40	35
డేటా ఎనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్	35	60	45
లెటర్ రైటింగ్, ఎస్సే (డిస్క్రిప్టివ్)	2	25	30

కోర్సు స్వరూపం

ఎంపికైనవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) కోర్సు ఏప్రిల్ మొదటి వారంలో మణిపాల్ క్యాంపస్‌లో ప్రారంభమవుతుంది. కోర్సు ఫీజు రూ.3.5 లక్షలు. జీఎస్‌టీ అదనం. ఇందులో భాగంగా వసతి, భోజన సౌకర్యాలుంటాయి. రుణం పొందవచ్చు. ఏడాది కోర్సు అనంతరం ప్రతి నెల కొంత మొత్తం చొప్పున సులభ వాయిదాల్లో చెల్లించాలి. కనీసం మూడేళ్లు విధుల్లో కొనసాగుతామని రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. వ్యవధి తీరిన తర్వాత దీన్ని తిరిగి చెల్లిస్తారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్నవారికి కోర్సు ఫీజు వెనక్కి ఇచ్చేస్తారు. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 4 ట్రైమిస్టర్లు ఉంటాయి. మొదటి 3 ట్రైమిస్టర్లకు నెలకు రూ.2500 స్టైపెండ్ చెల్లిస్తారు. చివరి ట్రైమిస్టర్ (జాబ్ ట్రైనింగ్) ఏదైనా బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఉంటుంది. ఈ సమయంలో నెలకు రూ.15,000 స్టైపెండ్ అందుతుంది. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారిని అసిస్టెంట్ మేనేజర్ (స్కేల్-1) హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

సన్నద్ధత...

ఇప్పటికే ఐబీపీఎస్ బ్యాంకు పీవో పరీక్షలు రాస్తున్నవారు అదే సన్నద్ధతో ఈ పరీక్షలనూ ఎదుర్కోవచ్చు. ● ఇటీవలే గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తాజా అభ్యర్థులు ముందుగా పరీక్షలో పేర్కొన్న విభాగాలకు సంబంధించి ప్రాథమికాంశాలతో అధ్యయనం ప్రారంభించాలి. అనంతరం ఎక్కువ మార్కులు సాధించడానికి అనువైన అంశాలను పూర్తిచేసుకోవాలి. ఆ తర్వాత మిగిలిన అంశాలు అధ్యయనం చేయాలి. ● సన్నద్ధత పూర్తయిన తర్వాత వీలైనన్ని మాదిరి ప్రశ్నలు, మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేయాలి. దీనివల్ల పరీక్ష విధానానికి అలవాటు పడటమే కాకుండా నిర్ణీత సమయంలో ఏ విభాగంలో ఎన్ని ప్రశ్నలు సాధించగలుగుతున్నారో తెలుస్తుంది. దాని ప్రకారం ఎంత వేగంతో సమాధానం ఇవ్వాలో అర్థం చేసుకుని, సన్నద్ధత మెరుగుపరచుకోవాలి. ● సమాధానం రాబట్టడానికి ఎక్కువ సమయం తీసుకునే విభాగం/ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అలాగే ఎక్కడ తప్పులు చేస్తున్నారో గుర్తించి, వాటిని తర్వాత పరీక్షలో పునరావృతం కాకుండా చూసుకోవాలి. ఇలా మాదిరి ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటూ పరీక్షకు సిద్ధమైతే తక్కువ వ్యవధిలోనే అంశాలు, సమయ పాలనపై పట్టు సాధించవచ్చు. ● రుణాత్మక మార్కులు ఉన్నందున ఏ మాత్రం తెలియని ప్రశ్నను వదిలేయడమే మంచిది. ● ఆబ్జెక్టివ్ పరీక్షతోనే డిస్క్రిప్టివ్ పరీక్ష రాయాలి. కాబట్టి దాన్నీ ఇప్పటి నుంచే సాధన చేయాలి. ● ఎక్కువ మార్కులు పొందడానికి డేటా ఎనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలి. దీని తర్వాత రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ ప్రాధాన్యమైనది. ఈ రెండు విభాగాల్లో మెరుగైన మార్కులు పొందినవారు తర్వాత దశకు చేరుకోగలరు. అయితే నిర్ణీత వ్యవధిలో ఈ విభాగాల్లో ప్రశ్నలకు సమాధానం గుర్తించడానికి గణిత సూత్రాలు, అనువర్తనం, షార్ట్ కట్ మెథడ్స్ వీటిని బాగా తెలుసుకోవాలి. ● వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలను సాధన చేయాలి. ఐబీపీఎస్, ఎస్‌బీఐ పీవో పాత ప్రశ్నపత్రాలను నిశితంగా గమనించాలి. దీనిద్వారా ప్రశ్నలు ఏ స్థాయిలో అడుగుతున్నారు, సన్నద్ధత ఎలా ఉంది, ఏ అంశాలను మరింత లోతుగా అధ్యయనం చేయాలి, వేటికి ఎంత సమయం కేటాయించాలి...మొదలైనవి తెలుసుకోవచ్చు.

యాక్సిస్ యంగ్ బ్యాంకర్...

ప్రైవేటు సంస్థల్లో ముఖ్యమైన యాక్సిస్ బ్యాంకు సైతం బ్యాంక్ ఆఫ్ ఇండియా తరహా ప్రకటన విడుదలచేసింది. యంగ్ బ్యాంకర్స్ ప్రోగ్రామ్ పేరుతో కోర్సుతోపాటు ఉద్యోగాన్ని అందిస్తోంది. పరీక్ష, ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఇలా అవకాశం వచ్చినవారు మణిపాల్‌లో కోర్సు పూర్తిచేయాలి. అనంతరం వీరిని యాక్సిస్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

అర్హత: 50 శాతం మార్కులతో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత. ప్రస్తుతం చివరి సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: పరీక్ష, ఇంటర్వ్యూలతో

ఈ అంశాల్లో: వెర్బల్ ఎబిలిటీ, ఎనలిటికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, లీజనింగ్ కాంప్రహెన్షన్ విభాగాల్లో అభ్యర్థిని పరీక్షిస్తారు. ఇందులో ప్రావీణ్యం చూపినవారికి వీడియో ఇంటర్వ్యూ నిర్వహించి తుది నియామకానికి ఖరారు చేస్తారు. ఇలా అవకాశం వచ్చినవారు మణిపాల్ సంస్థలో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ సర్వీసెస్ కోర్సు పూర్తిచేయాలి. మొత్తం ఫీజు రూ.3.89 లక్షలు. ఇందులో భాగంగానే వసతి, భోజనం, ఆండ్రాయిడ్ ట్యాబ్ అందిస్తారు. వీరు 6 నెలలు తరగతి గది శిక్షణ పొందుతారు. 3 నెలలు ఏదైనా యాక్సిస్ కార్యాలయంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. మరో 3 నెలల ఆన్ జాబ్ శిక్షణ పొందుతారు. మొదటి 6 నెలలు రూ.5000 స్టైపెండ్ ప్రతి నెలా అందుకుంటారు. 3 నెలల ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.12,000 పొందుతారు. ఈ 9 నెలల కోర్సు, ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ కేటాయిస్తారు. అన్ని ప్రోత్సాహకాలూ కలిపి వీరు ఏడాదికి రూ.4.42 లక్షల వేతనం అందుకోవచ్చు.

వెబ్‌సైట్: https://axisbankybp.online-ap1.com

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (సీమ్యాట్) వాటిలో ఒకటి. ఇటీవలే ఆ ప్రకటన వెలువడింది. ఈ పరీక్షలో సాధించిన స్కోరుతో సుమారు వెయ్యి సంస్థల్లో ఎంబీఏ/పీజీడీబీఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు.



సీమ్యాట్‌కు సిద్ధమవుదామా

పరీక్ష ఇలా

ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలో ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున 5 విభాగాల్లో వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. అవి.. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రెటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్. పరీక్ష వ్యవధి 3 గంటలు. ప్రతి ప్రశ్నకు 4, మొత్తం ప్రశ్నపత్రానికి 400 మార్కులు. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం...

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ప్రస్తుతం చివరి సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయసు నిబంధన లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 6 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్ కేటగిరీ పురుషులకు రూ.2000. మిగిలిన అందరికీ రూ.1000

పరీక్ష తేదీ: తర్వాత ప్రకటిస్తారు.

పరీక్ష కేంద్రాలు: ఏపీలో.. గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం. తెలంగాణలో.. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్. (అభ్యర్థులు ప్రాధాన్యం ప్రకారం 4 పరీక్ష కేంద్రాలు ఎంచుకోవాలి)

వెబ్‌సైట్: https://cmat.nta.nic.in/

విభాగాలవారీ...

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్: అభ్యర్థి ప్రాథమిక ఆంగ్ల పరిజ్ఞానాన్ని పరిశీలించేలా ప్రశ్నలు వస్తాయి. ఖాళీలు పూరించడం, వ్యాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం, కాంప్రహెన్షన్..తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి. హైస్కూల్ స్థాయి ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకుంటే ఎక్కువ మార్కులు పొందడం సులువే.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్: శాతాలు, నిష్పత్తి, సరాసరి, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, వయసు నిర్ణయించడం, రైళ్లు, పడవ వేగాలు, క.సా.గు., గ.సా.భా., మైశ్రాల్యాలు, ఘనపరిమాణాలు మొదలైన అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. వీటిలో దాదాపు అన్ని అంశాలూ హైస్కూల్ మ్యాథ్స్ పుస్తకాల్లోనివే. వాటిని బాగా చదువుకుని వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే సరిపోతుంది.

నంబర్ ఎనాలజీ, నంబర్ క్లాసిఫికేషన్, ఫిగర్ ఎనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ సిరీస్, కోడింగ్ డీకోడింగ్, వర్డ్ బిల్డింగ్...మొదలైన విభాగాల నుంచీ ప్రశ్నలు అడుగుతారు. సంఖ్యలు, అంకెలపైనే ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. గణితంలోని ప్రాథమికాంశాలపై పట్టు సాధించడం ద్వారా వీటికి సమాధానాలు గుర్తించవచ్చు.

లాజికల్ రీజనింగ్: అజంప్షన్లు, కన్‌క్లూజన్‌లు, ఇన్ఫరెన్స్‌లు, కాజ్ అండ్ ఎఫెక్ట్, ఎనలిటికల్ రీజనింగ్, లీనియర్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్లు, నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ రీజనింగ్.. తదితర అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగాల్లో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధనచేస్తే మెరుగైన స్కోరు పొందవచ్చు.

జనరల్ అవేర్‌నెస్: ఈ విభాగంలోని ఎక్కువ ప్రశ్నలకు సాధారణ పరిజ్ఞానంతోనే జవాబులు గుర్తించవచ్చు. దైనందిన జీవితంతో ముడిపడినవే అడుగుతారు. పర్యావరణాంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. రోజువారీ సంఘటనలనే ప్రశ్నలుగా రూపొందిస్తారు. వీటితోపాటు భారత్- పొరుగు దేశాలు, చరిత్ర, సంస్కృతి, భూగోళం, ఆర్థిక వ్యవహారాలు, పాలిటీ, సైన్స్ అంశాల నుంచీ ప్రశ్నలు ఉంటాయి. హైస్కూల్ సోషల్, సైన్స్ పాఠ్యపుస్తకాలు బాగా చదివి, తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్: ఇందులో ఏదైనా సందర్భానికి ఎలా స్పందిస్తారో తెలుసుకునేలా ప్రశ్నలు వస్తాయి. వివిధ కొత్త ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి. కొత్త వ్యాపారం, స్టార్టప్‌లకు సంబంధించి పథకాలు, ప్రోత్సాహకాలపై పరిజ్ఞానం ఉండాలి. తాజా వ్యాపార ధోరణులు, పెట్టుబడులు, ఎఫ్‌డీఐ, స్కిల్ డెవలప్‌మెంట్, వెంచర్ క్యాపిటలిస్ట్, ఫైనాన్షియల్ అసిస్టెన్స్...తదితర అంశాలు తెలుసుకోవాలి.

ప్రాథమిక అధ్యయనం పూర్తయిన తర్వాత సీమ్యాట్ పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. వీటిద్వారా ప్రశ్నలు ఏ విధంగా అడగవచ్చు, వాటి స్థాయి, అందుకు ఎలా సన్నద్ధం కావాలో తెలుస్తుంది. పరీక్షకు ముందు వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. సూత్రాలు ఉపయోగించే విధానం తెలుసుకోవాలి. షార్ట్ కట్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. ఐసెట్, మ్యాట్ సన్నద్ధత సీమ్యాట్‌కూ ఉపయోగపడుతుంది. అందువల్ల ఆ పరీక్షల పాత, మాదిరి ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయడం వల్ల ఎక్కువ మార్కులు పొందవచ్చు.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

విజయవాడలో

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: ప్లేయో **స్టైపెండ్:** నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: 28.02.2023
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/5f4b93

ప్రొడక్ట్ మార్కెటింగ్
సంస్థ: యశస్వి ఫిన్‌సర్వ్ ఐఎంఎఫ్ **స్టైపెండ్:** నెలకు రూ.6,000
దరఖాస్తు గడువు: 22.02.2023
అర్హతలు: ప్రొడక్ట్ మార్కెటింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/3fc2ca

మార్కెటింగ్
సంస్థ: విషన్ టాక్స్ **ప్రదేశం:** గుంటూరు, మంగళగిరి, విజయవాడ **స్టైపెండ్:** నెలకు రూ.2,000-3,000 **దరఖాస్తు గడువు:** 27.02.2023 **అర్హతలు:** కాపీరైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/62d636

ఆపరేషన్స్
సంస్థ: విషన్ టాక్స్ **ప్రదేశం:** గుంటూరు, మంగళగిరి, విజయవాడ **స్టైపెండ్:** నెలకు రూ.2,000-5,000 **దరఖాస్తు గడువు:** 25.02.2023 **అర్హతలు:** కాపీ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
internshala.com/i/918fc4

విజువల్ మీడియాలో

విజువల్ మీడియాలో పీజీ కోర్సులు ఏ యూనివర్సిటీల్లో ఉన్నాయి? వీటిని పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? – జగన్నాథ్

విజువల్ మీడియాలో.. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, యానిమేషన్, గ్రాఫిక్ డిజైన్ లాంటి సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సు చేయడానికి విద్యార్హతలతోపాటు సృజనాత్మకత, వర్చువల్ రియాలిటీపై ఆసక్తి, విజువల్ డిస్‌ప్లేలో అవగాహన, విజువల్ సమాచారాన్ని క్రోడీకరించడం/ విశ్లేషించడం, బాడీ లాంగ్వేజ్‌పై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్, చిత్రలేఖనంపై ఆసక్తి, కంప్యూటర్ పరిజ్ఞానం కూడా అవసరం. విజువల్ మీడియా కోర్సు చేసినవారికి సినిమా, టెలివిజన్ రంగాల్లో, యానిమేషన్ స్టూడియోల్లో, అడ్వర్టైజ్‌మెంట్ సంస్థల్లో ఉద్యోగాలు ఉంటాయి. ఈ కోర్సుని కొన్ని ప్రభుత్వ/ ప్రైవేటు విశ్వవిద్యాలయాలతోపాటు.. కళాశాలలూ అందిస్తున్నాయి. చేరాలనుకున్న సంస్థకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో నిర్ధారించుకోండి. విజువల్ మీడియాలో పీజీ కోర్సుని దిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీ, చెన్నైలోని అన్నా యూనివర్సిటీ, వేల్స్ యూనివర్సిటీ, మదురై కామరాజ్ యూనివర్సిటీ, లయోలా కాలేజ్, డావిన్సీ మీడియా కాలేజ్, అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్.. తదితర సంస్థలు అందిస్తున్నాయి. కొన్ని యూనివర్సిటీల్లో ఎంఏ కమ్యూనికేషన్ కోర్సులో విజువల్ మీడియాని ఒక స్పెషలైజేషన్‌గా అందిస్తున్నారు. విజువల్ మీడియా లాంటి ప్రొఫెషనల్ కోర్సుల్ని దూరవిద్యలో కాకుండా రెగ్యులర్‌గా చదవడమే మేలు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

జేఎన్‌యూలో 388 పోస్టులు

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూదిల్లీ పలు విభాగాల్లో ఖాళీల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.
విభాగాల వారీ: జూనియర్ అసిస్టెంట్-106, మల్టీ టాస్కింగ్ స్టాఫ్-79, మెస్ హెల్పర్-49, వర్క్స్ అసిస్టెంట్- 16, ఇంజినీరింగ్ అటెండెంట్-22.. తదితర పోస్టులు ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, స్టెనోగ్రఫీ, నెట్/ స్లెట్/ సెట్ ఉత్తీర్ణత
ఎంపిక: రాత పరీక్ష (పేపర్-1, పేపర్-2), ఇంటర్వ్యూ/ పర్ఫనాలిటీ టెస్ట్‌లతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10-03-2023.
వెబ్‌సైట్: https://www.jnu.ac.in/career

ఇంటర్వ్యూ

కేవీల్లో కాంట్రాక్టు టీచర్లు

బోయిన్‌పల్లి, ఏఎఫ్ఎస్ బేగంపేట్(సికింద్రాబాద్)లోని కేంద్రీయ విద్యాలయాలు 2023-24 విద్యా సంవత్సరానికి ఒప్పంద ప్రాతిపదికన కాంట్రాక్టు టీచర్స్/ స్టాఫ్ ఖాళీలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నాయి.
విభాగాలు: పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, ప్రైమరీ టీచర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్/ యోగా కోచ్‌లు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ కోచ్/ ఇన్‌స్ట్రక్టర్లు, అకడమిక్ కౌన్సెలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్
అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పీజీ, బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణత.
ఇంటర్వ్యూ తేదీ: 25.02.2023.
వేదిక: కేంద్రీయ విద్యాలయ, ఏఎఫ్ఎస్, బేగంపేట్.
వెబ్‌సైట్: https://bowenpally.kvs.ac.in/

ప్రవేశాలు

ఏపీ పాలిటెక్నిక్-2023

ఆంధ్రప్రదేశ్‌లోని పాలిటెక్నిక్‌ల్లో సీట్ల భర్తీకి పాలిసెట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది.

● **ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023**

అర్హత: పదోతరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. ఏప్రిల్/ మే-2023లో జరిగే పదోతరగతి లేదా తత్సమాన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు రుసుము: ఓసీ/ బీసీ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ/ ఎస్టీలకు రూ.100.
పరీక్ష కేంద్రాలు: అన్ని జిల్లాల్లోని 54 పట్టణాలు/ నగరాల్లోని దాదాపు 400 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ: 30.04.2023.
పరీక్ష తేదీ: 10.05.2023.
వెబ్‌సైట్: https://polycetap.nic.in/Default.aspx

పీజీ డిప్లొమా కోర్సులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ దూరవిద్యలో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.
పీజీ డిప్లొమా: ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్
అర్హత: ఏదైనా డిగ్రీ లేదా సమాన కోర్సు ఉత్తీర్ణత
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.03.2023.
వెబ్‌సైట్: www.braouonline.in/PGFirstyear/FirstHome.aspx

ఆర్ఐఎంసీలో ఎనిమిదో తరగతి

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన దెహ్రాదూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ) జనవరి- 2024 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు, బాలికల నుంచి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2024 జనవరి నాటికి ఏడో తరగతి చదువుతుండాలి లేదా ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 01.01.2024 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. 02.01.2011 - 01.07.2012 మధ్య జన్మించి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, వైవా వోస్, మెడికల్ ఎగ్జామినేషన్‌తో.
పరీక్షలో: మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్(125 మార్కులు) నుంచి వీటిని అడుగుతారు. ఇందులో అర్హులకు వైవా వోస్(50 మార్కులు) నిర్వహిస్తారు. ఇందులోనూ అర్హత సాధిస్తే వైద్య పరీక్షలు నిర్వహించి ప్రవేశాలు కేటాయిస్తారు.
దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.600, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు రూ.555 చెల్లించాలి.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 15.04.2023.
పరీక్ష తేదీ: 03.06.2023.
వెబ్‌సైట్: https://psc.ap.gov.in/